క్లుప్తంగా

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): పేద ప్రజల కోసం దాతలు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. గూడూర్ నివాసి ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ జన్మదినం సందర్భంగా బుధవారం మగ్దుంపూర్‌లోని అనాథ ఆశ్రమంలోని మానసిక దివ్యాంగులకు పండ్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. నానుతండాలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. శివకుమార్‌గౌడ్ ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఎంతో కృషి చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతియాదవ్, కిషన్‌నాయక్, నరేందర్, పూల అర్జున్, కర్ణకర్, బేతని ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్, తదితరులు ఉన్నారు.

పూరి గుడిసె దగ్ధం



దగ్ధమైన నివాస పూరి గుడిసె

శివ్వంపేట(నర్సాపూర్): నివాస పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని బిజ్లిపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబంతో కలిసి మేడ్చల్‌లో నివాసం ఉంటూ కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి అతని పూరి గుడిసెకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైపోయింది. అందులోని బియ్యం, నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి అయిపోయాయి. సంఘటన స్థలాన్ని ఆర్ఐ కిషన్ పరిశీలించి వివరాలు సేకరించారు. రెండున్నర లక్షల నష్టం జరిగినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే తన పూరి గుడిసెకు నిప్పు పెట్టినట్లు బాధితుడు వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళా సాధికారత చదువుతోనే సాధ్యం

– మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు కవిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): మహిళా సాధికారత సాధించాలంటే ప్రతీ ఆడబిడ్డ చదువుకోవాలని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ కవిత కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం టేక్మాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. చైల్డ్ యాక్ట్, ఉమెన్స్ ప్రొటెక్షన్ యాక్ట్, ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్, సైబర్ నేరాలకు సంబంధించి విషయాలపై అవగాహన కల్పించారు. 181 స్త్రీల హెల్ప్ లైన్, 1098 చిల్డ్రన్ హెల్ప్ లైన్, మహిళలు ఫిర్యాదులు చేస్తే సఖీ కేంద్రం ద్వారా పరిష్కారం చేస్తారని తెలిపారు. శిశు సంక్షేమ శాఖ ఫైనాన్స్ లిటరసీ రమేశ్, కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ చంద్ర, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర సందర్శన

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ తృతీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం పట్టణంలోని హెడ్‌పోస్ట్‌ఆఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీహరితో మాట్లాడి పోస్ట్ ఆఫీస్ అందిస్తున్న వివిధ రకాల సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ శరత్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్ రెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్ కుమార్ , డాక్టర్ చంద్రశేఖర్, హరిత, చంద్ర శేఖర్, రఫీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ అందజేత

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కోర్టులో బుధవారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. లింగారెడ్డిపల్లి గ్రామ శివారులో ప్రవీణ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ కేసులో ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చారు. అనంతరం టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బాధిత కుటుంబానికి రూ.12లక్షల పరిహారం ఇప్పించారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

నర్సాపూర్: అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ, అసైన్‌మెంట్, అటవీ శాఖ భూములు.. ఏ భూములైనా.. తమకేంటి అంటూ అడ్డగోలుగా మట్టి తవ్వి తరలిస్తు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. మట్టి కావాల్సిన వ్యక్తులకు మట్టి వ్యాపారులు అన్నీ తాము చూసుకుంటామని చెప్పి ప్రభుత్వ, దేవాలయ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టా తవ్వి సరఫరా చేస్తున్నారు. ఆయా శాఖల అధికారుల అండదండలతోనే అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మట్టి తవ్వుతున్నారని అధికారులకు ఎవరైనా సమాచారం ఇస్తే సదరు వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచాల్సిన అధికారులల్లో కొందరు అక్రమ మట్టి వ్యాపారులకు చెప్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను అధికారులు లీక్ చేయడంతో అక్రమ మట్టి వ్యాపారులతో తమకేందుకు గొడవలు అనే ధోరణితో అక్రమ మట్టి తవ్వకాల సమాచారం ఇవ్వడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

తాజాగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్ పరిధిలో మూడు రోజులుగా మట్టి తవ్వకాలు చేపట్టి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అసైన్డ్ భూమిని చదును పేరిట అసైన్డ్ భూమితో పాటు ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపడుతున్నారు. కాగా అసైన్డ్ భూమిలో సైతం మట్టి తవ్వడానికి వీలు లేకున్నా మట్టి తవ్వి తరలిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మట్టిని అడ్డగోలుగా తవ్వడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ శాఖకు చెందిన ఆర్డీఓ, మండల తహసీల్దార్‌తో పాటు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌లో తాజాగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నర్సాపూర్‌కు నాలుగు కిలో మీటర్ల దూరంలోని మాడాపూర్‌లో సైతం చాలా రోజుల పాటు మట్టిని తవ్వి అక్రమ తరలించినా రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోనందున ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌లో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు



అనుమతులు లేకుండా మట్టిని తవ్వి నింపుతున్న జేసీబీ

అనుమతులు లేకుండా తరలించవద్దు

అనుమతులు లేకుండా మట్టి తవ్వి తరలించొద్దని మండల తహసీల్దార్ శ్రీనివాస్ చెప్పారు. అసైన్డ్‌భూమిని చదును చేయాలన్న తమ అనుమతి తీసుకోవాలని అన్నారు. హన్మంతాపూర్‌లో మట్టి తవ్వి తరలిస్తున్న విషయం తన దృష్టికి రాలేదని తమ సిబ్బందిని పంపి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

అడ్డగోలుగా..

నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ భూములు నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఆలయ భూముల్లో మట్టిని అడ్డగోలుగా తవ్వడంతో ఎక్కడ చూసినా గుంతలే కన్పిస్తాయి. తాజాగా దేవాలయ భూములలో రాత్రి పూట మట్టిని తవ్వి పట్టణంలోని ఓ ప్లాట్ బేస్మెంట్ నింపేందుకు టిప్పర్ల ద్వారా తరలించారు. కాగా మండలంలోని మాడాపూర్ శివారులోని ప్రభుత్వ భూముల నుంచి ఇటీవల మట్టి వ్యాపారులు రాత్రి పూట తవ్వకాలు చేపట్టి మట్టిని సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలకు తరలించారు. ఇంత జరిగినా.. రెవెన్యూ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

స్వచ్ఛత, పారిశుద్ధ్యంపై అవగాహన



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ కేజీబీవీలో విద్యార్థుల మానవహారం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని పాఠశాలల్లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత, పారిశుద్ధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మానవహారం నిర్వహించడంతో పాటు, వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆనంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్షోత్సవాలు పక్కగా నిర్వహించాలి

స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు పక్కగా నిర్వహించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో వచ్చే నెల 2 వరకు స్వచ్ఛతా మీ సేవా పనులు నిర్వహించాలన్నారు. నాయకులు, ప్రజల సహకారంతో గ్రామాల్లో వందశాతం స్వచ్ఛత చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీఓ శరత్‌కుమార్ ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాల కోసం ప్రతిజ్ఞ

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాలలో స్వచ్ఛత హీ సేవలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛత హీ సేవపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవీందర్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బగలాముఖీ ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం విశిష్ట పూజలు చేశారు. వేద పండితుడు, బగలాము ఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్న ప్రసాదం వితరణ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

వెల్దుర్తి(తూప్రాన్): అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మండల కేంద్రం మాసాయిపేటలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేశారు. నల్ల బ్యాడ్జిలతో గ్రామంలో ర్యాలీ చేపట్టిన అనంతరం జాతీయ రహదారి 44 పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు యాదగిరి మాటాడారు. కార్యక్రమంలో వినోద్, జగన్, సూరి, విజయ్‌కుమార్, దశరథ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



స్కూల్ గేమ్స్ పోటీ విజేతలతో నోడల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు

నర్సాపూర్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని మండల నోడల్ అధికారి తారాసింగ్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో విజేతలకు బుధవారం అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా ఆటల పోటీల్లో విజేతలను అభినందించారు. ఓటమి చెందిన విద్యార్థులు నిరుత్సాహ పడొద్దని, మరింత శ్రద్ధతో ప్రాక్టీస్ చేసి ముమ్ముందు విజేతలుగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు హెడ్మాష్టర్లు విఠల్, చంద్రశేఖర్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు సామ్యానాయక్, రవి, ఆంజనేయులు, శ్రీకాంత్‌గౌడ్, ఆఫ్రిన్, అనిత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నర్సాపూర్: మండలంలోని జక్కపల్లిలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో పలు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ ఫర్హానా తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల20 లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94413 65458 నంబరులో సంప్రదించాలన్నారు.

మృతుడి అవయవాలు దానం



మురుగేందర్‌స్వామి (ఫైల్)

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన మురుగేందర్ స్వామి(45)బ్రెయిన్ డెడ్ కావడంతో అతని అవయవాలు దానం చేశారు. మురుగెందర్ ఈనెల 15న సంగారెడ్డి జిల్లా సదాశివపేట సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదానికి గురవగా చికిత్స నిమిత్తం సంగారెడ్డి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా బుధవారం ఉదయం అతను బ్రెయిన్‌డెడ్ అయిందని వైద్యులు చెప్పడంతో అతని కుటుంబ సభ్యులు మృతుడి అవయవాలు దానం చేశారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని గర్భిణులు బాలింతలు సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం టేక్మాల్ మండలంలోని సాలోజిపల్లి గ్రామంలో పౌష్టికాహారంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, కూరగాయలు వంటి పౌష్టికాహారం సమయానికి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎవరు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్ తిరుమల, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడిని కోల్పోవడం బాధాకరం



మాట్లాడుతున్న భిక్షపతి

టేక్మాల్(మెదక్): తెలంగాణ ఉద్యమకారుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల మరణించిన తెలంగాణ ఉద్యమకారుడు గుమ్మడి జగన్ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి, ఆర్థికసాయాన్ని అందజేశారు. స్వప్న, జిల్లా యువత కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



సదాశివపల్లిలో వినాయకుడికి పూజలు చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



వెల్మకన్నలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో భక్తులు



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో లడ్డూను దక్కించుకున్న రఘురాంరెడ్డి



చేగుంట కన్యకాపరమేశ్వరి ఆలయంలో 56 రకాల నైవేద్యాలతో పూజలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వినాయకుడికి భక్తులు 56 రకాల నైవేద్యాలతో పూజలను నిర్వహించారు.

రూ.రెండు లక్షలకు వినాయక లడ్డూ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో క్రేజీ బోయ్స్ వినాయకుడి లడ్డూను రూ.రెండు లక్షల ఒక వెయ్యికి గ్రామానికి చెందిన రఘురాంరెడ్డి, మరో లడ్డూను గంగిడి మల్లారెడ్డి రూ.ఒక లక్ష ధరకు వేలంపాటలో దక్కించుకున్నారు. కూచారం జైత్రాం తండాలో వినాయకుని లడ్డూను మాలవత్ హీరాలాల్ రూ.82 వేలకు దక్కించుకున్నారు.

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని కోలిగడ్డ వీధిలో హనుమాన్ ఆలయం వద్ద యువ నేతాజి గణేశ్ మండలి ఆధ్వర్యంలో వినాయక లడ్డూను రూ.67777లకు చంద్రశేఖర్‌గౌడ్ దక్కించుకున్నాడు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

రామాయంపేట(మెదక్): వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పేర్కొన్నారు. చైర్మన్‌తో పాటు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ సర్వయకుంట, కొత్త చెరువులను పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **డిప్యూటేషన్ రద్దు చేయాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మౌనిక డిప్యూటేషన్ రద్దు చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌పాషా, రామానుజం డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ వెంకట్రావ్‌పేట ప్రాథమిక పాఠశాలలో 79మంది విద్యార్థులు ఉండగా.. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నట్లు చెప్పారు. కాగా అందులో నుంచి ఉపాధ్యాయురాలు మౌనికను అధికారులు ముత్రాజ్‌పల్లితండా పాఠశాలకు డిప్యూటేషన్ వేశారని చెప్పారు. డిప్యూటేషన్ రద్దు చేసి ఉపాధ్యాయురాలిని సొంత పాఠశాలకు పంపించాలని కోరారు. నాయకులు దుర్గయ్య, వీరాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్ఆర్ఎస్ త్వరగా పూర్తిచేయాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కౌడిపల్లిలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 686 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఉపాధి హామీలో పని అడిగిన ప్రతీ ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలని కాళ్లకల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింగం అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు.

◆ **పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజల సౌకర్యం కోసం చుట్టుపక్కల పది గ్రామాల కూడలి అయిన వెంకట్రావ్‌పేటగేట్ వద్ద పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కౌడిపల్లికి సీహెచ్‌సీ మంజూరు కావడంతో ప్రస్తుతం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ రెండు ఒకే చోట కొనసాగుతున్నాయని చెప్పారు. కౌడిపల్లిలోని పీహెచ్‌సీని వెంకట్రావ్‌పేటగేట్ వద్దకు మార్చడం వల్ల పరిసర పది గ్రామాలు, తండాలకు చెందిన ప్రజలు ఉచిత ప్రభుత్వ వైద్యం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

◆ **పనికోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం**



రాజు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని అనంతసాగర్‌లో జరిగింది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన 35 ఏళ్ల వయసుగల మ్యాకల రాజు పనికి వెళ్తున్నట్లు మంగళవారం ఇంట్లోంచి వెళ్లాడు. రాత్రి వరకు రాజు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా అందుబాటులో లేకపోవడంతో బంధువుల వద్ద వెతికినా ఆచూకీ కనిపించలేదు. రాజు సోదరుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **ఎస్టీయూ సభ్యత్వ నమోదు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ (స్టేట్ టీచర్స్ యూనియన్) నిరంతరం కృషి చేస్తుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా అదనపు కార్యదర్శి సైదన్నగారి నరేష్‌లతో కలసి మండలంలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షుడు రాజేశ్, నవీన్, రవినాయక్, ఎల్లంచ పాల్గొన్నారు.

◆ **పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక**

తూప్రాన్: పీఆర్‌టీయూ మండలశాఖ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. రెండేళ్లకు తూప్రాన్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రకాష్, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఝాన్సీరాణి, కార్యదర్శిగా శ్రీధర్, శ్వేతా కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ **భూ సమస్యలపై తహసీల్దార్లకే ఫిర్యాదులు ఇవ్వాలి**

మెదక్ కలెక్టరేట్: మెదక్ డివిజన్ పరిధిలోని రైతులు తమ భూ సమస్యలపై తహసీల్దార్లకే ఫిర్యాదులు అందజేయాలని ఆర్డీఓ రమాదేవి బుధవారం తెలిపారు. ఇందుకోసం ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

◆ **పాఠశాలల తనిఖీ**

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాలలతో పాటు, అప్పాజీపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నీలకంఠం బుధవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థుల భాష, గణిత సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

◆ **అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం**

రామాయంపేట(మెదక్): శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందుతులను కఠినంగా శిక్షించాలని యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం రామాయంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు వెంకట్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఆర్గనైజర్ మహేశ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

◆ **ఏటీఎం కార్డు చోరీ**

తూప్రాన్: ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసి ఇస్తానని గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎం కార్డును మార్చి రూ.9,600 డ్రా చేశారు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్లాపూర్‌కు చెందిన వడ్ల గున్నాలు అనే వ్యక్తి జులై 8న ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బుల డ్రా చేసేందుకు వచ్చాడు. డ్రా చేయడం తెలియక అక్కడే ఉన్న వ్యక్తికి తన ఏటీఎంను ఇచ్చి డ్రా చేయమని చెప్పాడు. కాని ఏటీఎం కార్డు పని చేయడం లేదని తెలుపడంతో ఇంటికి వెళ్లాడు. తిరిగి సెప్టెంబరు 18న బ్యాంకు వెళ్లగా రూ.9,600 డ్రా చేసినట్లు తెలడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **అడవిపంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు**

మెదక్ మున్సిపాలిటీ: అడవి పంది ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కొర్విపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో మంగ వెంకటేష్, విజయ్ కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. చేగుంట మండలం భీంరావుపల్లి గ్రామానికి మంగళవారం వీరిద్దరూ బైక్‌పై వెళ్లారు. అదేరోజు రాత్రి తిరిగి బైక్‌పై మెదక్‌కు వస్తుండగా మండలం కొర్విపల్లి వద్ద అడవి పంది ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతున్నాడు.

◆ **వృద్ధులకు దుప్పట్లు పంపిణీ**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని వంద మంది వృద్ధులకు మాలాని ఫోమ్స్ పరిశ్రమ యజమాన్యం దుప్పట్లు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో చిన్నశంకరంపేట తాజామాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాలాని పరిశ్రమ హెచ్ఆర్ పృథ్వీరాజ్, ప్రొడక్షన్ మేనేజర్స్ భవాని శంకర్, రామ్ కిషన్, జీవన్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి**

చిన్నశంకరంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించాలని ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జంగరాయి, కొర్విపల్లి, టీ.మాందాపూర్, ఎస్.కొండాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు శివప్రసాద్, జబ్బర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ **పైపులైన్ లీకేజీ పట్టని అధికారులు**

నర్సాపూర్: మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి చాలా రోజులు గడుస్తున్నా.. లీకేజీకి మరమ్మతులు చేయకపోవడం గమనార్హం. పట్టణంలోని చౌరస్తా సమీపంలో భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా బయటకు వెల్తుంది. లీకేజీ ఏర్పడగా సంబంధిత శాఖ సిబ్బంది వచ్చి లీకేజీని పరిశీలించి వెల్లారే తప్ప మరమ్మతులు చేయకపోవడంపై ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

◆ **గృహజ్యోతి సందేశ పత్రాల పంపిణీ**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో గృహజ్యోతి లబ్ధిదారులకు సందేశ పత్రాలను ఆయా గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ అందజేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో గృహజ్యోతి కార్యక్రమానికి సంబంధించిన పత్రాలను అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా లబ్ధిదారుల పేర్లతో కూడిన పత్రాలను అందజేస్తున్నామని వారు పేర్కొన్నారు.

◆ **ప్రజావాణిని వినియోగించుకోవాలి**

నర్సాపూర్: మండల తహసీల్దార్ల కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల ప్రజల భూ సమస్యలను ఇకపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు.

◆ **కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో బుధవారం కాలభైరవస్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పురోహితుడు ఉమాశంకర శర్మ స్వామివారికి చందన అలంకరణ చేశారు.